

వరుస చోరీలతో బెంబేలు

మున్సిపల్ పరిధిలో వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు జరుగుతున్నాయి. 8లో▸



ఉద్యోగ భద్రత కల్పించాలి

అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నేత రామకృష్ణ డిమాండ్ చేశారు. 8లో▸



ఎందుకీ అసమానత

ఫస్ట్ ఏఎన్‌ఎంలతో సమానంగా పనిచేస్తున్నా తమను పట్టించు కోవడం లేదని సెకండ్ ఏఎన్‌ఎంలు నిరసన బాట పట్టారు. 9లో▸

న్యూస్‌రీల్

నిరుపేదలను ధనవంతులుగా మారుస్తాం

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: పేదలను ధనవంతులుగా మార్చడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీ పనిచేస్తోందని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. తాండూరు నియోజకవర్గంలోని బీసీబంధు, మైనార్టీ రుణాలకు సంబంధించిన చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం పట్టణంలోని జేఎంఎస్ గార్డెన్‌లో నిర్వహించారు. బీసీ బంధు పథకం కింద ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున 300 మందికి రూ.3కోట్లు, 50 మంది మైనార్టీలకు మొత్తం రూ.50 లక్షలకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. త్వరలో మరింతమందికి ఆర్థికసాయం అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సందల్‌రాజుగౌడ్, బీసీ సంక్షేమ అధికారి ఉపేందర్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీ పానర్సింహులు,ఎంపీపీ అనురాధ, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు,బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: మర్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఎకనామిక్స్ ఉర్దూ మీడియం గెస్ట్ ఫ్యాకల్టీ పోస్ట్ నియామకం కొరకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ వరకు మార్కుల మెమోలు, ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు బోనఫైడ్ సర్టిఫికెట్స్, రెసిడెన్షియల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో ఇంటర్మీడియట్ కార్యాలయం వికారాబాద్‌లో ఈనెల 14వ తేదీలోపు సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 80197 74542 నంబర్లో సంప్రదించాలన్నారు.

మద్యం దుకాణాలకు 118 దరఖాస్తులు

అనంతగిరి: జిల్లాలో నూతన మద్యం దుకాణాల ఏర్పాటుకు గాను ఇప్పటివరకు 118 దరఖాస్తులు వచ్చాయని జిల్లా ఎక్సైజ్ అధికారి నవీన్ చంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 59 మద్యం దుకాణాల ఏర్పాటు చేయనుండగా.. వికారాబాద్‌లో 21, పరిగి 51, తాండూర్ 7, మోమిన్‌పేట్ 22, కొడంగల్ 17 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తులు సమర్పించేందుకు ఈనెల 18వ తేదీ తుది గడువని ఆయన తెలిపారు.

12 కొత్త జీపీల ఏర్పాటు

తాండూరు: తాండూరు నియోజకవర్గంలో కొత్తగా 12 గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేస్తూ బుధవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గంలోని పెద్దేముల్ మండలంలో.. తింసన్‌పల్లి, గోపాల్‌పూర్, పెద్దేముల్ తండా, రచ్చకట్టతండా, యాలాల మండలంలో.. బాగాయిపల్లి, మల్‌రెడ్డిపల్లి, పేర్కంపల్లితండా, దేవులాతండా, దుబ్బతండా, బషీరాబాద్ మండలంలో.. గంగ్వార్, మల్కన్‌గిరి, పర్యానాయక్ తండాను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా చేస్తూ జీఓ జారీ చేశారు. ఇప్పటివరకు ఆయా గ్రామాలు జీపీలకు అనుబంధ గ్రామాలుగా కొనసాగాయి. కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటుపై బీఆర్‌ఎస్ నాయులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రత్యేక చొరవతోనే ఆయా గ్రామాలు పంచాయతీలుగా ఏర్పడ్డాయని వారు స్పష్టం చేశారు.

పీఏసీఎస్ కార్యాలయంలో తనిఖీలు

కందుకూరు: స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో సహకార సంఘం ఉన్నతాధికారులు తనిఖీలు చేపట్టారు. సొసైటీలో జరిగిన లావాదేవీలకు సంబంధించి రికార్డులను గురువారం ఉదయం నుంచి జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ల బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్లు సరస్వతి, సత్యనారాయణరెడ్డి, మాధవరెడ్డితో పాటు ఆడిటర్ రమేష్ తనిఖీల్లో పాల్గొన్నారు. ఎవరెవరికి రుణాలు ఇచ్చారు, చెల్లించిన వడ్డీ, రైతుల పంటల బీమా తదితరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వడ్డీ చెల్లించిన రైతులు కొంతమంది నుంచి మళ్లీ వడ్డీలు వసూలు చేసినట్లుగా, డైరెక్టర్లకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకుండానే తీర్మాన పత్రాలపై సంతకాలు సేకరించినట్లు గ్రహించారు. డైరెక్టర్ల నుంచి రాతపూర్వకంగా వివరణ తీసుకున్నారు. తమకు సమాచారం లేని విషయాలపై వివరణ కోరడంతో కొంత మంది డైరెక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై అధికారుల్ని వివరణ కోరగా రికార్డుల్లో నమోదు చేసిన వివరాలను పూర్తిస్థాయిలో కంప్యూటరీకరించలేదని వెల్లడించారు. వాటినే పరిశీలిస్తున్నట్లుగా తెలిపారు.

అరుస్తూ.. కరుస్తూ



ఇళ్లలోకి చొరబడి పిచ్చికుక్క వీరంగం

- పది మందికి గాయాలు
- వీరిలో ఆరుగురు చిన్నారులు
- రేగడిమైలారంలో ఘటన
- తీవ్రంగా గాయపడిన బాధితులకి హైదరాబాద్‌లో చికిత్స



రాములు



నవ్యశ్రీ



నందిని



ఆదిత్య



దివ్యశ్రీ

బొంరాస్‌పేట: పిచ్చికుక్క వీరంగం చేసింది.. బిగ్గరగా మొరు గుతూ (అరుస్తూ) కనిపించిన వాళ్లందరినీ కరుస్తూ భయభ్రాంతులు సృష్టించింది. ఈ సంఘటనగురువారం ఉదయం రేగడిమైలారంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఇందిరానగర్ కాలనీలోని పలు ఇళ్లలో దూరిన వీధికుక్క చిన్నారులపై దాడికి పాల్పడింది. ఆరుగురిని కరిచి, తీవ్రంగా గాయ పరిచింది. వీరి అరుపులు, కేకలతో భయప డిన తల్లిదండ్రులు పరుగున వచ్చి పిల్లలను ఆస్పత్రికి తరలించే టెన్షన్‌లో ఉండగా.. ఒకరి తర్వాత ఒకరిని కరుస్తూ వెళ్లింది. దీని దాడిలో నెల్లి శ్రీనివాస్ కొడుకు ఆదిత్య(ఎల్‌కేజీ), బంటు అంజిలయ్య కూతురు నందిని(యూకేజీ), నెల్లి వెంకటప్ప కూతురు నవ్యశ్రీ(ఎల్‌కేజీ),మంగలి శ్రీనివాస్ కూతురు దివ్యశ్రీ(ఎల్‌కేజీ), మమత, నర్మద గాయపడ్డారు. అలాగే ఇందిరానగర్‌కు చెందిన వృద్ధుడు కుమ్మరి రాములును కరిచిన కుక్క.. అక్కడి నుంచి గ్రామంలోని జాతీయ రహదారిపైకి వచ్చి డీప్లానాయక్ తండాకు చెందిన పూల్‌సింగ్ అనే వ్యక్తిని గాయపర్చింది. దీని దాడిలో మొత్తం పది మంది గాయపడ్డారు. వీరందరినీ కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమచికిత్స చేశారు. గాయాలు ఎక్కువగా ఉన్న నలుగురు చిన్నారులను హైదరాబాద్‌లోని నల్లకుంట ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం బాధితులు ఇళ్లకు చేరుకున్నారు. ఈ సంఘటనతోఊరంతా ఉలిక్కిపడింది. పది మందిపై దాడిచేసిన కుక్క మాత్రం తప్పించుకుపోయింది. దీంతో వీధుల్లో కుక్కలను చూస్తే గ్రామస్తులు హడలిపోతున్నారు. కుక్కలను అరికట్టాలని కోరుతున్నారు.

లెక్క పక్కాగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- వ్యవసాయ గణనపై అధికారులతో కలెక్టర్ సమీక్ష
- ఈనెల 15లోపు మొదటి దఫా పూర్తిచేయాలని ఆదేశం

వికారాబాద్ అర్బన్: పొరపాట్లకు తావివ్వకుండా వ్యవసాయ గణన చేపట్టాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు.జిల్లా ముఖ్య ప్రణాళికశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో గురువారం మండల స్థాయి వ్యవసాయ అధికారులు, విస్తీర్ణ అధికారులు, సహాయక గణాంకాల అధికారులు, సూపర్‌వైజర్లకు వ్యవసాయ గణనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మా ట్లాడుతూ.. వ్యవసాయ గణన ఫేస్1, ఫేస్2, ఫేస్3 అని మూడు దఫాల్లో చేపడతారని తెలిపారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి చేపట్టే గణాంకాల్లో భాగంగానే 2021–22 సంవత్సరానికి సంబంధించిన 11వ వ్యవసాయ గణన ప్రస్తుతం చేపడుతున్నారన్నారు. ఇందులో భాగంగా మొదటి దఫాను ఆగస్టు 15లోపు పూర్తిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి సర్వేనంబర్, పట్టాదారు వారీగా గణాంకాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. క్లస్టర్లలోని సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలకు వివరారించాలని ఆదేశించారు. అనంతరం జాయింట్ డైరెక్టర్ సొమ్య వ్యవ సాయ గణనపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో ఉపగణాంకాల అధికారి విజయలక్ష్మి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి నిరంజన్రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోపాల్,వ్యవసాయ గణాంకా లశాఖకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలు తెరిపించండి..

వికారాబాద్ అర్బన్: 18 సంవత్సరాలు నిండినప్పటికీ బ్యాంకులో ఖాతాలు లేని ప్రతి ఒక్కరికీ ఖాతాలు తెరిపించే దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జూన్ నెల చివర వరకు జరిగిన ప్రగతిపై బ్యాంకర్లతో కలెక్టర్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండి బ్యాంకుల్లో ఖాతాలు తెరువని యువత వివరాలను గ్రామ కార్యదర్శులు, మెప్మా, ఆర్పీలు సేకరించి వారు బ్యాంకు ఖాతాలు తెరిచే విధంగా ప్రోత్సహించాలన్నారు. పంట రుణాలపై కలెక్టర్ సమీక్షిస్తూ వికారాబాద్ జిల్లా వ్యవసాయ ఆధారిత జిల్లా అని, జిల్లా రైతులకు పంట రుణాలను విరివిగా అందించి రైతులకు సహకరించాలని సూచించారు. కొన్ని బ్యాంకుల పనితీరు బాగుందని, మిగిలిన బ్యాంకర్లు కూడా లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. పంట రుణాల కింద ఖరీఫ్ సీజన్‌కు రూ.1,550 కోట్లు లక్ష్యం కేటాయించగా.. జూన్ 30 నాటికి రూ.1,010 కోట్లు రుణాలను అందజేసి 60 శాతం లక్ష్యం సాధించినట్లు తెలిపారు. సెప్టెంబర్ మాసాంతం వరకు రైతులకు విరివిగా పంట రుణాలను అందజేసి 80% లక్ష్యాన్ని పూర్తిచేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు 2015–16 నుంచి రుణాలు మంజూరు కాలేదని, ఇందులో ఎస్సీలకు సంబంధించి 81, ఎస్టీలకు సంబంధించిన 179 పెండింగ్ రుణాలను 15 రోజుల్లో పూర్తి చేసేందుకు బ్యాంకర్లు ప్రత్యేక సమావేశం నిర్వహించుకోవాలని తెలిపారు. స్టాండ్ అప్ ఇండియా కింద ప్రతి ఒక్క బ్రాంచ్ నుంచి ఒకరికి చొప్పున ఎస్సీ, ఎస్టీ మహిళలకు రుణాలను మంజూరు చేయాలని సూచించారు. రుణాల రికవరీలో ప్రభుత్వ యంత్రాంగం కూడా సహకరించాలని కలెక్టర్ తెలిపారు.బ్యాంకుల సమావేశాలను సకాలంలో నిర్వహించాలని తదుపరి సమావేశం 30 రోజుల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. వచ్చే సమావేశానికి నామమాత్రంగా కాకుండా లక్ష్యం పురోగతిపై జరగాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు, వ్యవసాయ శాఖ అధికారి గోపాల్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



మోమిన్‌పేట: చంద్రాయన్‌పల్లిలో ఇళ్లస్థలాల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

- ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

మోమిన్‌పేట: బీఆర్‌ఎస్ సర్కార్‌తోనే వికారాబాద్ అభివృద్ధి సాధ్యమని మ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మొరంగపల్లి, మేకవనంపల్లి గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య సబ్ సెంటర్ భవనాలకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం చంద్రాయన్‌పల్లి గ్రామంలోని 113మంది నిరుపేదలకు ఇళ్లస్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వికారాబాద్‌లో రూ.232 కోట్లతో మెడికల్ కాలెజీ, రూ.23కోట్లతో ఆయూష్ ఆస్పత్రి, డిగ్రీ కళాశాల, రూ.96కోట్లతో రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సబ్ సెంటర్ల ద్వారా వైద్యం అందిస్తున్నామని అన్నారు. ఆయూష్ ఆస్పత్రి ఏర్పాటుతో ఇక్కడి ప్రజలకు హోమియో చికిత్సలు అందుబాటులోకి రానున్నాయని అన్నారు. చంద్రాయన్‌పల్లిలో 113మంది పేదలకు ఇళ్లపట్టాల పంపిణీ చేశామని వారికి గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.3లక్షలు అందేలా చూస్తామన్నారు. నూతన కాలనీకి కేసీఆర్ కాలనీగా నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, సర్పంచ్‌లు అంజయ్య,శ్రీనివాస్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి,ఎంపీటీసీ సభ్యురాలు రోజ, గోవర్ధన్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి,తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఆర్‌ఐ రాజు, ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం చైర్మన్ హరిశంకర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల రైతుబంధు అధ్యక్షుడు అజీజ్, మండల అధ్యక్షుడు వెంకట్,బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి..

మోమిన్‌పేట: యువత రాజకీయాల్లో రావాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పిలుపునిచ్చారు. గురువారం మోమిన్‌పేటలో నిర్వహించిన బీఆర్‌ఎస్ యువగర్జన సమావేశం, ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి అనంతరం ఏజేఆర్ ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన యువగర్జన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాజకీయాల్లో యువత చురుకైన పాత్ర పోషించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సమక్షంలో వివిధ పార్టీల నుంచి 300 మంది నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. అనంతరం బీఆర్‌ఎస్ మండల యువత అధ్యక్షుడిగా తిరుపతిరెడ్డిని నియమించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల అధ్యక్షుడు వెంకట్, నాయకులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తే అతడి దినచర్య



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

- కొడంగల్ మండలం అప్పాయిపల్లి శివారులో గంజాయి విక్రేత అరెస్టు
- గతంలో నిందితుడిపై పలు పీఎస్‌లలో కేసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ కోటిరెడ్డి

కొడంగల్: కొడంగల్‌లో గంజాయిని విక్రయించేందుకు యత్నించిన నిందితుడిని మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామ శివారులో టాస్క్‌ఫోర్సు సిబ్బంది, స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొడంగల్ సీఐ కార్యాలయంలో జిల్లా ఎస్పీ కోటిరెడ్డి గురువారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం శాఖాపూర్ గ్రామానికి చెందిన గోపాల్ (50) రెండు సంవత్సరాలుగా ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని తెచ్చి జహీరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నాడు. గతంలో ఇతడిపై గంజాయి కేసుతో పాటు దొంగతనం వంటి పలు కేసులు నమోదైనట్లు ఎస్పీ తెలిపారు. ఇటీవల ఒడిశాలో 11 కిలోల (6 ప్యాకెట్లు) గంజాయిని కొనుగోలు చేసి శాఖాపూర్‌కు తీసుకువచ్చాడు. ఆ గంజాయిని విక్రయించేందుకు బుధవారం శాఖాపూర్ నుంచి బైక్‌పై కొడంగల్‌కు బయలుదేరాడు. పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్, కొడంగల్ పోలీసులు మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామం వద్ద నిందితుడిని అరెస్టు చేశారు. పూర్తి విచారణ అనంతరం నిందితుడిపై కొడంగల్ పీఎస్‌లో పలు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. యువత వ్యసనాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గంజాయి నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న పోలీసులను, టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో పరిగి డీఎస్పీ కరుణాసాగర్ రెడ్డి, కొడంగల్ సీఐ రాములు, ఎస్‌ఐ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలు తగ్గుముఖం

దౌల్తాబాద్: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో దాతల సహకారంతో పోలీసులు ఏర్పాటు చేసిన 30 సీసీ కెమెరాలను గురువారం ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటుతో చాలా గ్రామాల్లో నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రంలో ఓ వ్యక్తిని దుండగులు కిడ్నాప్ చేయగా.. సీసీ కెమెరాల సహాయంతో 6 గంటల్లోనే బాధితుడిని రక్షించడంతో పాటు నిందితులను పట్టున్నామన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, సీఐ రాములు, ఎస్‌ఐ రమేష్‌కుమార్, జెడ్పీటీసీ మహిపాల్, ఎంపీపీ విజయ్‌కుమార్, సర్పంచ్ శిరీష, మాజీ జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, వెంకట్రావు, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

చిన్నారులకు రక్షణగా 'ఇంద్రధనుష్'

- మొదలైన మొదటి విడత టీకాల పంపిణీ
- జిల్లాలో 542 మంది చిన్నారులు, 32 మంది గర్భిణులు గుర్తింపు
- తప్పక వేయించాలంటున్న వైద్యాధికారులు





రామాయగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, (ఇన్‌సెట్‌లో) గర్భిణికి టీకా వేస్తున్న సిబ్బంది

వికారాబాద్ అర్బన్: చిన్నారులకు భవిష్యత్‌లో సోకే పలురకాల వ్యాధుల నుంచి రక్షించేందుకు ఇంద్రధనుష్ టీకా ఎంతో ఉపయోగపడుతుందని వైద్యాధికారులు అంటున్నారు. ప్రధానంగా పిల్లలకు ధనుర్వాతం, తట్టు, క్షయ, పోలియో వంటి వ్యాధులతో ఇన్‌ఫెక్షన్ సోకుతుంది. ఇలాంటి ఇన్‌ఫెక్షన్లు సోకకుండా ఇంద్రధనుష్ టీకా పూర్తిస్థాయిలో పిల్లలకు రక్షణ కల్పిస్తుంది. ఈనెల 7వ తేదీ నుంచి జిల్లాలోని ఐదేళ్లలోపు చిన్నారులకు, గర్భిణులకు ఈ టీకాలు వేయడం ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రి తాండూరుతో పాటు, ఏరియా ఆస్పత్రుల్లో, పీహెచ్‌సీల్లో ఈ టీకాలు వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని 2016లో ప్రారంభించింది. ఇందులో భాగంగా అంతకుముందు రోగనిరోధక శక్తి పెంచేందుకు ఏడు వ్యాక్సిన్లు వేసేవారు. ప్రస్తుతం టీకాల సంఖ్యను 12కి పెంచారు. వీటిలో గర్భిణులకు.. టీడీ (టెటానస్ అండ్ డిఫ్తీరియా), చిన్నారులకు.. టీబీ, పోలియో, హెపటైటిస్–బి, రోటావైరస్, నిమోకోకల్ న్యుమోనియా, రెబెల్లా, జపనీస్ ఎన్‌సెఫలిస్, మీజిల్స్ ఉన్నాయి. సమయానికి వీటిని వేయించుకోని గర్భిణులు, చిన్నారుల కోసం ఏటా మూడు విడతల్లో మిషన్ ఇంద్రధనుష్ నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది తొలివిడత కార్యక్రమం ఆగస్టు 7వ తేదీ నుంచి ప్రారంభించారు.

ఆస్పత్రులకు వెళ్లనివారికి...

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాల్లో ఈ టీకాలు అందుబాటులో ఉంచారు. ఈ టీకాలను ప్రతి బుధవారం పిల్లలకు ఇస్తారు. నేరుగా ఈ కేంద్రాలకు వెళ్లి టీకాలను పిల్లలకు ఇప్పించవచ్చు. ఆస్పత్రులకు వెళ్లని వారి కోసం మిషన్ ఇంద్రధనుష్ పేరిట ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి టీకాలు ఇస్తున్నారు. ఇప్పటివరకు ఆస్పత్రులకు వచ్చి ఈ టీకాలు తీసుకోని వారి వివరాలను వైద్య ఆరోగ్యశాఖ ఇటీవలే సేకరించింది.


మూడు విడతల్లో...

జిల్లాలో మిషన్ ఇంద్రధనుష్ టీకాలను మూడు విడతల్లో వేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్ణయించారు. అందులో భాగంగా మొదటి విడతలో ఆగస్టు 7 నుంచి 12వ తేదీ వరకు టీకాలు వేయనున్నారు. రెండో విడతలో సెప్టెంబర్ 11 నుండి 16వరకు, మూడో విడతలో అక్టోబర్ 9 నుంచి అక్టోబర్ 14 వరకు టీకాలు వేసేందుకు చర్యలు చేపట్టారు.

శిశుమరణాలను తగ్గించడమే లక్ష్యంగా..

తప్పిపోయిన పిల్లలుకు, మతాచారాల ప్రకారం టీకాలు తీసుకోని పిల్లలకు, ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వలస వచ్చినవారి పిల్లలకు, స్లమ్ ఏరియాల్లో నివాసం ఉండే పిల్లలకు, ఇటుక బట్టీలు, నిర్మాణ రంగాల వద్ద పనిచేస్తున్న పిల్లలకు మిషన్ ఇంద్రధనుష్ టీకాలు ఇచ్చి శిశు మరణాలను తగ్గించాలనేదే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం.

టీకాలు వేయించాలి



మిషన్ ఇంద్రధనుష్ టీకాలను గర్భిణులు, ఐదేళ్లలోపు చిన్నారులకు ఇప్పించాలి. జిల్లా, ఏరియా ఆస్పత్రులతో పాటు ఈ టీకాలను పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాల్లో కూడా అందుబాటులో ఉంచాం. ఇప్పటివరకు ఈ టీకాలు వేయించని వారు ఎవరైనా ఉంటే తప్పకుండా దగ్గర్లోని సెంటర్లకు వెళ్లి వేయించాలి. టీకాలు వేయడంతో పిల్లలకు దీర్ఘకాలిక రోగాలతో పాటు, అంటువ్యాధులు కూడా సోకకుండా ఇమ్యూనిటీని ఇస్తాయి. జిల్లాలో ఈ టీకాలు ఎంతమందికి ఇవ్వాలనే దానిపై ఇప్పటికే వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి లెక్కలు తీశారు.

– డాక్టర్ పాల్వాన్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

క్లుప్తంగా

భార్య కాపురానికి రాలేదని..

మనస్తాపానికి గురై భర్త ఆత్మహత్య



శ్రీనివాస్(ఫైల్)

పరిగి: భార్య కాపురానికి రాలేదని మనస్తాపానికి చెందిన భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన సయ్యాద్‌పల్లిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తలారి శ్రీనివాస్(45) కుమారుడు గత నెల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో శ్రీనివాస్ తాగుడుకు బానిస కావడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. గ్రామంలో పంచాయితీ పెట్టినా కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన బుధవారం రాత్రి తన పొలంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని అక్క యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ అదృశ్యం



యాదమ్మ(ఫైల్)

కుల్కచర్ల: పొలానికి వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన కుల్కచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చౌడాపూర్ మండలం లింగంపల్లికి చెందిన మేకల యాదమ్మ(42) ఈ నెల 7న పొలానికి వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లింది. తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికారు. ఫలితం లేకపోవడంతో ఆమె కూమారుడు వెంకటేష్ కుల్కచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీశైలం తెలిపారు.

ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం

- యాదవులు రాజకీయంగా ఎదగాలి
- సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీశ్ యాదవ్

ఇబ్రహీంపట్నం: యాదవులంతా సంఘటితంగా ఉండాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్, జిల్లా అధ్యక్షుడు జగదీశ్ యాదవ్ అన్నారు. ఇబ్రహీంపట్నంలో గురువారం జరిగిన యాదవుల ముఖ్య నేతల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. యాదవులంతా సంఘటితంగా ఉంటేనే సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదిగేందుకు ఐక్యతతో ముందుకు సాగాలన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమ నాయకురాలు గానకోకిల బెల్లి లలిత జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. అనంతరం యాదవ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్ అనిల్‌కుమార్ యాదవ్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షులు జగదీశ్‌యాదవ్ పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లేష్, రఘునాథ్, కృష్ణ, వెంకటేశ్, శ్రీరామ్ యాదవ్, బాల్‌రాజ్, బీ వెంకటేశ్, మహేశ్, శ్రీనివాస్, రామకృష్ణ, చందు పాల్గొన్నారు.

అమరవీరులను స్మరించుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌రెడ్డి

మీర్‌పేట: స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను ప్రతి పౌరుడు స్మరించుకోవాలని సింగిల్ విండో మాజీ చైర్మన్, బీజేపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ కొలన్ శంకర్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. స్వాతంత్య్రం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆజాదిక అమృత్ మహోత్సవంలో మన దేశం – మన మట్టి కార్యక్రమంలో భాగంగా దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరిస్తూ మట్టిని పూజించాలన్నారు. ఈ నెల 11, 12 తేదీల్లో స్వాతంత్య్ర సమర యోధులను, అమరవీరుల కుటుంబాలను గుర్తించి సత్కరిస్తామన్నారు. అదే విధంగా 13 నుంచి 15వ తేదీ వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని, 16 నుంచి 20వ తేదీ వరకు ప్రతి గ్రామంలో మట్టిని తీసుకొని దేవాలయాల్లో పూజించి ర్యాలీలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. అమరుల త్యాగ ఫలాలను అందరికీ అందించేందుకే అమృత త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. మీర్‌పేట కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు నర్సింహ, పార్టీ ఫ్లోర్ లీడర్ గోవర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమేశ్వర్, నాయకులు ప్రభాకర్, యాదగిరి యాదవ్, నాగరాజు పాల్గొన్నారు.

వరుస చోరీలతో బెంబేలు

- పగలు రెక్కీ.. రాత్రి వేళ దొంగతనాలు
- తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- నిఘా పెట్టాలని ప్రజల వేడుకోలు



5వ వార్డుల్లో గోడను కూల్చి పైపులు ఎత్తుకెళ్లిన దొంగలు



పాల్‌సీలింగ్ సామగ్రి దొంగతనానికి వచ్చిన దొంగలు

పరిగి: మున్సిపల్ పరిధిలో వరస చోరీలతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు తాళం వేసిన ఇళ్లను, నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. అందినకాడికి అపహరించుకుపోతున్నారు. దొంగలను పట్టుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరిగి పట్టణంలో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయి. తాళం వేసిన ఇళ్లను ఎంచుకొని బంగారం, వెండి, నగలు, నగదును ఎత్తుకెళుతున్నారు. దొంగతనానికి వచ్చిన వారు ఆనవాళ్లు దొరక్కుండా జాగ్రత్త పడుతుండడంతో పోలీసులకు సవాల్‌గా మారింది.

పగలు రెక్కీ.. రాత్రి వేళ చోరీలు

దొంగలు పగలు వీధుల్లో తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను గుర్తిస్తున్నారు. రాత్రి వేళ చోరీలకు పాల్పడుతున్నారు. అంతేకాకుండా కొత్తగా నిర్మిస్తున్న ఇళ్ల వద్ద ఉంచిన సామగ్రిని ఎత్తుకెళుతున్నారు. పాత నేరస్తులపై నిఘా పెట్టకపోవడం, కొత్తగా వస్తున్న వ్యక్తులపై కన్నేసి ఉంచకపోవడంతో వరుస చోరీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మరో వైపు రాత్రి పెట్రోలింగ్ కూడా సరిగ్గా నిర్వహించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అర్ధరాత్రి వరకు యువకులు, గుర్తు తెలియని వ్యక్తులు వీధుల్లో దర్జాగా తిరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని పట్టణ వాసులు అంటున్నారు.

ఇటీవల జరిగిన కొన్నిఘటనలు

మల్కాపూర్ సమీపంలోని ఓ వెంచర్‌లో బండవెలికచర్ల గ్రామానికి చెందిన బల్వంత్‌రెడ్డి కొత్తగా నూతనంగా ఇల్లు నిర్మిస్తున్నాడు. ఈ నెల 9వ తేదీ అర్ధరాత్రి ఇద్దరు దొంగలు వచ్చి ఇంట్లోని రూ. 70వేల విలువ చేసే పాల్ సీలింగ్ సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఇదే ఇంట్ల15 రోజుల క్రితం 3.5 క్వింటాళ్ల స్టీల్, సిలిండర్, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లారు. రాత్రి వేళ దొంగతనం చేయడం, సీసీ కెమెరాల్లో ముఖం కనిపించకుండా నిందితులు జాగ్రత్త పడ్డారు. మున్సిపల్ పరిధిలోని 5వ వార్డు పట్టణ ప్రకృతి వనం ప్రహరీని పైపులతో నిర్మించారు. దొంగలు ప్రహరీని పగులగొట్టి పైపులను ఎత్తుకెళ్లారు. మున్సిపల్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలా ప్రతి పది, పదిహేను రోజులకు ఒక్కసారి ఎక్కడో ఒక చోట దొంగతనం జరుగుతూనే ఉంది. పోలీసులకు ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. చిన్న చిన్న దొంగతనాలను పోలీసులు పట్టించుకోకపోవడంతో నిత్యం చోరీలు జరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు. పోలీసులు స్పందించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చోరీలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం

దొంగతనాలు జరగకుండా పట్టణంతో పాటు గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నాం. పట్టణంలో రోజు పర్యవేక్షిస్తున్నాం. పట్టణ శివారులో ఉన్న ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. దీంతో అక్కడ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నాం. త్వరలో దొంగలను పట్టుకుంటాం.

– వెంకటరామయ్య, సీఐ, పరిగి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు

ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ధర్నా

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ, ఆశ వర్కర్ల నిరసన

అనంతగిరి: అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు చంద్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్నా ప్రభుత్వం చాలీచాలని వేతనాలు ఇస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే అన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు. వెంటనే అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లను రెగ్యులర్ చేయాలని లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ, కార్యదర్శి, సభ్యులు భారతి, రాజేశ్వరి, మంజుల, సంధ్యారాణి, శశికళ, శోభ, చంద్రకళ, హారతి, బాలమణి, వసంత, వాణి, లక్ష్మీ, సుజాత, తిరుమల, ఆశా వర్కర్ల జిల్లా అధ్యక్షురాలు మాధవి, సునీత, స్వరూప, పద్మ, శోభా, రాధ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు

కానిస్టేబుల్‌తో దురుసు ప్రవర్తన: వ్యక్తిపై కేసు

చేవెళ్ల: మద్యం తాగి విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ ఘటన మండలంలోని ఆలూరు గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ వీరబ్రహ్మం కథనం మేరకు.. ఆలూరు గ్రామంలో కొందరు మద్యం సేవించి గొడవ పడుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి గొడవ పడుతున్న వారిని పంపించారు. రాత్రి పది గంటల సమయంలో కిరాణా షాప్ తెరచి ఉండడంతో బంద్ చేయాలని పోలీసులు ఆదేశించారు. అక్కడే ఉన్న శివరాజ్ అనే వ్యక్తి ఎందుకు బంద్ చేయాలంటూ పోలీసులతో గొడవ పెట్టుకున్నాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకే కార్డెన్ సర్చ్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శేఖర్‌గౌడ్

తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్

యాలాల: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కార్డెన్ సర్చ్ నిర్వహిస్తున్నట్లు తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపారు. గురువారం మండలంలోని బషీర్‌మియా తండాలో యాలాల పోలీసుల ఆధ్వర్యంలో సాయంత్రం కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ద్విచక్ర వాహనాలు, ఆటోల పత్రాలు, లైసెన్సులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో గొడవలు లేకుండా శాంతియుతంగా ఉండాలన్నారు. ఈ ఏడాది చివరిలోగా సాధారణ ఎన్నికలు సమీపిస్తుండటంతో గొడవలు లేకుండా కలిసిమెలసి ఉండాలన్నారు. గొడవలు పడి పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరగరాదన్నారు. అనంతరం ఇటీవల వెలువడిన ఎస్‌ఐ ఫలితాల్లో బషీర్‌మియా తండాకు చెందిన కానిస్టేబుల్ ఉమాదేవిని డీఎస్పీ, రూరల్ సీఐ రాంబాబు, ఎస్‌ఐ అరవింద్‌కుమార్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మిత్రునాయక్, డివిజన్ ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఇద్దరు మృతి

- తాండూరులో ఘటన





మృతులు నగేష్, కూర్మారావు

తాండూరు టౌన్: బైకును లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ ఘటన గురువారం తాండూరులోని ఇందిరా చౌక్ వద్ద చోటుచేసుకుంది. పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కరన్‌కోట గ్రామానికి చెందిన బీ నగేష్(38) ఇరిగేషన్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. గురువారం హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్ కూర్మారావు(50)తో కలిసి బైకుపై బస్టాండు వైపు నుంచి చించోళి మార్గంలో వెళుతున్నాడు. ఇందిరాచౌక్ సర్కిల్ వద్దకు రాగానే హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న లారీ వెనుక నుంచి బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తాండూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వారు చికిత్స పొందుతూ మృతి చెందారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, అజాగ్రత్తగా లారీ నడిపిన డ్రైవర్ సోహెల్, లారీ యజమాని అయిన అతని తండ్రి అల్లావుద్దీన్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

డాడీ.. వెళ్లిపోతున్నా..

- తండ్రి మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన కొడుకు
- బయటకు వెళ్లి బతుకుతానని లెటర్



జ్ఞానేశ్వర్(ఫైల్)

పహాడీషరీఫ్: తండ్రి మందలించాడని ఓ కొడుకు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. పోతూ పోతూ ఇంటి డోర్‌కు లెటర్ అతికించి వెళ్లాడు. అందులో.. 'డాడీ నేను ఇంట్లో నుంచి వెళ్లి పోతున్నా.. నువ్వేకదా నన్ను వెళ్లిపోమన్నావు.. నేను బయటికి వెళ్లి బతుకుతా.. డాడీ' అంటూ లెటర్ రాసి డోర్‌కు అతికించాడు.. ఈ ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మామిడిపల్లి రంగనాయకుల కాలనీకి చెందిన కృష్ణ కుమారుడు జ్ఞానేశ్వర్(20). ఇంటర్ వరకు చదివి ఏ పని చేయకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ విషయమై తండ్రి మందలించాడు. ఈ నెల 8వ తేదీ ఉదయం వస్త్రాలు సర్దుకొని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. వెళ్తూ వెళ్తూ లెటర్ రాసి డోర్‌కి పెట్టాడు. దీన్ని గమనించిన తండ్రి కొడుకు కోసం పలుచోట్ల గాలించాడు. ఫలితం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. జ్ఞానేశ్వర్ ఆచూకీ తెలిస్తే పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్, లేదా సెల్ నంబర్ 87126 62367కు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

వేతనాల్లో కోత సరికాదు

బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, ఆశ కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు మంజుల



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

వికారాబాద్ అర్బన్: ఆశ వర్కర్ల వేతనాల్లో కోతలు పెట్టడం సరికాదని, నిర్ణయించిన మేరకు రూ. 9,500 చెల్లించాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, ఆశా కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు మంజుల ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఆశ వర్కర్లు డీఎంహెచ్‌ఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ ఆశ వర్కర్లు వేతనం ఇస్తున్నారని, అదే వేతనాన్ని ఫిక్స్‌గా ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు. అనేక పీహెచ్‌సీలలో ఆశల వేతనాల్లో కోత విధిస్తున్నారని తెలిపారు. వేతనాల్లో కోత విధించడం తగదన్నారు. ఏఎన్‌ఎంలు, జీఎన్‌ఎంలు, పీహెచ్‌ఎన్‌లు ఆశాలను బెదిరిస్తున్నట్లు ఆయన తెలిపారు. వ్యాక్సిన్ కిట్లు మోపిస్తూ వారితో వెట్టి చాకిరీ చేయించే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపించారు. అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓకు తమ డిమాండ్లపై వినతిపత్రం అందజేశారు.

మాతోనే గిరిజనుల సంక్షేమం

- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి
- ఆదివాసి దినోత్సవం సందర్భంగా తండాలో నిద్ర



కొత్త తండాలో గిరిజన మహిళలతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న పారిజాతరెడ్డి



నాగుల్‌దోని తండాలో సమస్యలు తెలుసుకుంటున్న భాస్కర్‌రెడ్డి

మహేశ్వరం: గిరిజనుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి ఏఐసీసీ ఆదేశాల మేరకు ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని మహేశ్వరం మండలం పడమటి తండాల్లో పర్యటించారు. గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకొని అక్కడే నిద్ర చేశారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ.. గిరిజన, ఆదివాసుల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. గిరిజన రిజర్వేషన్లు, ఇందిరమ్మ ఇళ్లు, సాగు, పోడు భూములను పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలు గెలుపొందిన కేంద్రం, రాష్ట్రంలో అధికారం చేపట్టబోతుందని ఆయన జోస్యం చెప్పారు. అనంతరం గిరిజనులతో సహపంక్తి భోజనం చేశారు.

నాగుల్‌దోని తండాలో..

బీఆర్‌ఎస్ ప్రభుత్వం గిరిజనులను అన్ని విధాలా మోసం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దేప భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నాగుల్‌దోని తండాలో గిరిజనులతో కలిసి సహపంక్తి భోజనం చేసి అక్కడే నిద్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు.

కొత్త తండాలో..

మండలంలోని కొత్త తండాలో పీసీసీ జనరల్ సెక్రటరీ, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే గిరిజన తండాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు నేనావత్ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.


మద్యం మత్తులో ఈత యువకుడి మృత్యువాత



కృష్ణ కుమార్ శుక్ల మృతదేహం

శంకర్‌పల్లి: పూటుగా మద్యం సేవించి యువకుడు బావిలో ఈత కొట్టేందుకు దిగి మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని మిర్జాగూడ గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని పురానాపూల్, రహీంపుర ప్రాంతానికి చెందిన కృష్ణకుమార్ శుక్ల(26) గోల్ఫ్ క్లబ్‌లో పని చేసున్నాడు. బుధవారం మధ్యాహ్నం కృష్ణ మరో ముగ్గురు స్నేహితులు మిర్జాగూడ శివారులో మద్యం సేవించారు. సాయంత్రం సమీపంలోని బావిలో ఈత కొట్టేందుకు వెళ్లారు. బావిలోకి దిగిన నలుగురిలో ముగ్గురు ఒడ్డుకు చేరుకోగా కృష్ణ కుమార్ శుక్ల బయటి రాలేదు. దీంతో స్నేహితులు కంగారు పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఫలితం లేకపోవడంతో బుధవారం రాత్రి మోకిల పోలీసులకు సమాచారం ఇచ్చారు. గురువారం ఉదయం పోలీసులు గజ ఈతగాళ్లతో బావిలో గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తాగుబోతు భర్తను భరించలేక ఆత్మహత్య



అంజలి(ఫైల్)

బంజారాహిల్స్: తాగుడుకు బానిసైన భర్తను భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని శ్రీరాంనగర్‌లో నివసించే వల్లూరి అంజలి(26) కాల్ సెంటర్‌లో పనిచేస్తోంది. ఆమె భర్త నరేంద్ర రోడ్ నెం. 12లోని టీఎక్స్ ఆస్పత్రిలో వార్డు బాయ్‌గా పని చేస్తుండేవాడు. ఇటీవల ఉద్యోగం కూడా చేయకుండా మద్యానికి బానిసై ఇంట్లోనే ఉంటూ భార్య సంపాదనతోనే మద్యం తాగుతున్నాడు. ఈ విషయంలో ఆమె ఎన్నిసార్లు మందలించినా వినిపించుకోకపోగా సెల్‌ఫోన్లు అమ్ముకుంటూ వచ్చిన డబ్బులతో మద్యం తాగుతుండటమే కాకుండా అబద్దాలు కూడా చెప్పుండేవాడు. దీంతో విసిగిపోయిన అంజలి గురువారం తెల్లవారుజామున తన గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామ సంఘాలు బలోపేతం అవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం రామ్మూర్తి

డీపీఎం రామ్మూర్తి

యాలాల: ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగే గ్రామ సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని డీపీఎం(జిల్లా ప్రాజెక్టు ఆఫీసర్) రామ్మూర్తి సూచించారు. గురువారం నిర్వహించిన యాలాల ఐకేపీ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంపీపీ బాలేశ్వర్ గుప్తాతో కలిసి సమావేశ ఏజెండా, చేపట్టాల్సిన ప్రణాళికలను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సీఐఎఫ్ రికవరిలో యాలాల ఐకేపీ ఉత్తమ మండలంగా ఎంపికైందన్నారు. రానున్న ఏడాది కాలానికి సీఐఎఫ్ రూ.2 కోట్లు రుణ టార్గెట్‌ను పెట్టుకొని ముందుకు సాగాలని సూచించారు. గ్రామ సంఘాలను బలోపేతం అయ్యేలా ప్రతి నెలా క్రమం తప్పకుండా సభలు, సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో 7 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో మరిన్ని కొనుగోలు కేంద్రాలకు అవకాశం ఇస్తామని ఎంపీపీ పేర్కొన్నారు. అనంతరం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రమీల, ఎంపీడీఓ పుష్పలీల, సీసీలు బందెప్ప, నర్సింహులు, సిబ్బంది చిరంజీవి, షఫీ తదితరులు పాల్గొన్నారు.

జీరో పోస్టులు లేకుండా చూడాలి



ఎమ్మెల్యే ఆనంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

అనంతగిరి: డీఎస్సీ నోటిఫికేషన్‌లో జీరో పోస్టులు లేకుండా చూడాలని డీఎస్సీ అభ్యర్థులు ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌ను కోరారు. గురువారం వారు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అదేవిధంగా వికారాబాద్ ఏకేఆర్ స్టడీ సర్కిల్ రూపొందించిన టెట్ స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, ఏకేఆర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమణ తదితరులు పాల్గొన్నారు

రెడ్డి భవన్‌కు స్థలం కేటాయించాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రెడ్డి జేఏసీ ప్రతినిధులు

మీర్‌పేట: మహేశ్వరం నియోజకవర్గంలో రెడ్డి సామాజిక వర్గానికి భవన నిర్మాణం కోసం ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని గురువారం రెడ్డి జేఏసీ అధ్యక్షుడు బొర్ర సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సబితారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి భవన నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు సురేందర్‌రెడ్డి తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో రెడ్డి సంఘం రాష్ట్ర కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి, రెడ్డి జేఏసీ ప్రతినిధులు తీగల విక్రంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అరుణ, మాధవరెడ్డి, సత్యనారాయణరెడ్డి, సురేందర్‌రెడ్డి, ఊర్మిళ, గీతారెడ్డి పాల్గొన్నారు.